# భూకంప గండం గట్టెక్కాలంటే..!

- ఇళ్ల నిర్మాణ పద్ధతులు మారాల్సిందే
- ప్రమాదపుటంచున నేపాల్, ఉత్తర భారత రాష్ట్రాలు
- ఇప్పటికీ అక్కడ పాత పద్ధతుల్లోనే కట్టడాలు
- తనిఖీలో వెల్లడైన అంశాలతో కేంద్ర నిపుణుల కమిటీ నివేదిక
- ఆ వివరాలను 'ఈనాడు'కు వెల్లడించిన సభ్యుడు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: కాళ్ల కింద నేల కదిలిపోతుంటే నీడనిచ్చే ఇళ్లు పేకమేడల్లా కుప్పకూలి ప్రాణాలు తీస్తున్నాయి. నేపాల్‌ను కుదిపేస్తున్న భూ ప్రకంపనలు ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాలనూ గజగజ వణికిస్తున్నాయి. ఇప్పటికే భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగిపోయింది. ఇంతటితోనైనా ఈ విపత్తు ఆగిపోతుందన్న భరోసాలేదు. భవిష్యత్తులో ఈ తరహా ప్రమాదాల నుంచి రక్షణ పొందటం ఎలా అన్నదే మన ముందున్న ప్రశ్న. భూ ప్రకంపనలు తట్టుకొని నిలిచేలా భవనాలను నిర్మించుకోవటం ఒక్కటే తక్షణ పరిష్కారం అంటున్నారు కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సభ్యులు. గృహనిర్మాణాల్లో పాత పద్ధతులను వీడి ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షలో వీటిని చేపట్టాలని సూచిస్తున్నారు. జోద్‌పూర్ ఐఐటీ డైరెక్టర్ సీవీఆర్ మూర్తి అధ్యక్షతన అయిదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ రామన్ చర్ల ప్రదీప్‌కుమార్ కూడా ఉన్నారు. ఈ కమిటీ కార్‌మాండూకు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతోంది. ఈ నివేదికలో విషయాలను ప్రదీప్‌కుమార్ 'ఈనాడు'కు ప్రత్యేకంగా వివరించారు

- ఇటీవలి వరుస భూ ప్రకంపనల వల్ల కార్‌మాండూలో 40 వేల వరకూ ఇళ్లు పూర్తిగా కుప్పకూలాయి. ప్రకంపనల తీవ్రత ప్రభావం దాదాపు 2.5 లక్షల ఇళ్లపై పడింది. మరోసారి భూకంపం వస్తే భారీ ఎత్తున ఇళ్లు నేలకూలే అవకాశం ఉంది.
- కార్‌మాండూ తీవ్రమైన భూకంపాలు వచ్చే అయిదో జోన్‌లో ఉంది. భూకంపం వస్తే ఇళ్లు పేకమేడల్లా కూలుతాయని తెలిసినా కూడా అక్కడి వారు కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. దశాబ్దాలనాటి కట్టడాల సంగతి అలా ఉంచినా కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఇళ్ల విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. స్తంభాల(కాలమ్స్)పై కాకుండా గోడలపైనే నిర్మించారు.



ప్రదీప్‌కుమార్

- ఇప్పటికీ నేపాల్‌లో ఇంజినీర్ల సమక్షంలో కాకుండా తాపీ మేస్త్రీలతోనే ఇళ్లను నిర్మిస్తున్నారు. నేపాల్‌లో ఏ ప్రాంతంలో ఎంత తీవ్రతలో భూకంపాలు వస్తాయన్న దానిపై కచ్చితమైన సమాచారం ఉన్నా దీనిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇళ్లను నిర్మించేటప్పుడు భూ పరీక్షలు చేయించడం లేదు. దీనివల్లే కొత్తగా నిర్మించిన ఇళ్లు కూడా ఇటీవలి ప్రకంపనలతో కూలిపోయాయి.
- బిహార్‌తోపాటు పలు ఉత్తర భారత రాష్ట్రాల్లోనూ నేపాల్‌లో మాదిరిగానే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఇళ్లు తీవ్రమైన భూ ప్రకంపనలు వస్తే తట్టుకొనే స్థితిలో లేవు. ఈ రాష్ట్రాల్లో పెను ముప్పు పొంచి ఉందని కేంద్రం ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ హెచ్చరించింది. అందుచేత ఈ ఇళ్లను ఇప్పటికైనా ఇంజనీర్లతో తనిఖీలు చేయించి తగు చర్యలు తీసుకోవాలని సూచించింది.

### ఈ బృందం ఏమి చేసిందంటే...

కార్‌మాండూలో ఇప్పటికీ వేల మంది ప్రాణభయంతో ఆరుబయటే ఉంటున్నారు. తమ ఇళ్లు నివాస యోగ్యమేనా కాదా అన్నది ఇప్పుడు వారి ప్రధాన సమస్య. వాటి పటిష్ఠతను తనిఖీ చేసి చెప్పటం కోసం కేంద్ర నిపుణుల కమిటీ. . 250 మంది ఇంజినీర్లకు కార్‌మాండూలో శిక్షణ ఇచ్చింది. భవిష్యత్తు గృహ నిర్మాణాల విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాన్నీ శిక్షణలో భాగం చేశారు.